
సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 26 । జూలై । 2023



నూజివీడులో సీటుకే మొగ్గు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫ్యాకల్టీ, వసతులు మెరుగ్గా ఉండటంతో ఇక్కడ సీటు కోసం పదో తరగతి టాపర్‌లు మొగ్గు చూపుతున్నారు. 8లో ▸



కార్గిల్ పోరులో మాధవరం యోధులు

పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ పోరులో మాధవరం గ్రామానికి చెందిన జవాన్లు యుద్ధంలో వెన్నుచూపకుండా పోరాడారు. బుధవారం కార్గిల్ దివస్ సందర్భంగా కథనం.. 8లో ▸



రామాలయానికి విరాళం

ద్వారకాతిరుమల: ఈస్టు యడవల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కోటగిరి విజయకుమారి రూ.10 లక్షలను విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

డ్వాక్రా సొమ్ము అవకతవకలపై విచారణ



తాడేరులో విచారణ చేస్తున్న అధికారులు

భీమవరం అర్బన్: తాడేరు గ్రామంలోని డీఆర్డీఏ కార్యాలయంలో డ్వాక్రా సొమ్ము అవకతవకలపై మహిళల ఫిర్యాదు మేరకు మంగళవారం విజయవాడ నుంచి అధికారుల బృందం విచారణ చేపట్టింది. విచారణాధికారిగా ఎస్ఈఆర్‌పీ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ ప్రాపర్టీ (సర్ఫ్) ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి క్షేత్రస్థాయిలో పలు రికార్డులు, కంప్యూటర్ డేటాలో తనిఖీలు నిర్వహించారు. 2019–2011 వరకు జిల్లాలోని 11 మండలాలకు సంబంధించి స్వయం సహాయక సంఘాల నుంచి ఒక్కొక్క మహిళ నుంచి నిమిత్తం రూ.350 వసూలు చేసినట్లు, ఆ సొమ్మును వివిధ పద్దులకు ఖర్చు చేసి వారికి ఎటువంటి రుసుం ఇవ్వకుండా వచ్చిన ఆరోపణలపై ఆర్‌టీఐ ప్రొటెక్షన్ కౌన్సిల్ స్టేట్ సెక్రటరీ కె.రవి కుమార్ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ప్రతి ఏడాది చట్టబద్ధంగా అధికారులతో ఆడిటింగ్ చేయించకుండా ప్రైవేటు ఆడిట్‌లతో ఆడిటింగ్ చేయించడం, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించే విషయంలో కమీషన్లు తీసుకున్న ఆరోపణలపై 11 మండలాలకు సంబంధించి ఏపీఎంలను పిలిచి బృంద సభ్యులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో సేవలు ఉచితం



సమావేశంలో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి

ఏలూరు (టూటౌన్): శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచితంగా లభించే సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక న్యాయసేవా భవన్‌లో వివిధ ప్రభుత్వ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో రవాణా, పోస్టల్, బీమా, వైద్యం, విద్య, బ్యాంకింగ్, ఎన్ఆర్‌జీఈఎస్, హౌసింగ్, రియల్ ఎస్టేట్, పారిశుద్ధ్యం మొదలైన సేవలలో లోపం జరిగినప్పుడు న్యాయం కోసం ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీనిపై సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఎన్ఆర్ఈజీఎస్, డీఎం అండ్ హెచ్ఓ, సెంట్రల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురు సీఐలకు స్థానచలనం

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాలకు సంబంధించి పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇద్దరు సీఐలను వీఆర్‌కు తరలించగా, మరో ముగ్గురిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో పనిచేస్తున్న ఎం.గీతారామకృష్ణను కాకినాడ జిల్లా తునికి, కాకినాడ జిల్లా తునిలో పనిచేస్తున్న ఎం.నాగదుర్గారావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు, ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న జి.శ్రీనివాసును భీమవరం టూటౌన్‌కు, భీమవరం టూటౌన్‌లో పనిచేస్తున్న బి.కృష్ణకుమార్‌ను కైకలూరు రూరల్‌కు, కైకలూరు రూరల్‌లో పనిచేస్తున్న వైవీఎల్ నాయుడును ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

మిషన్ వాత్సల్యకు 1045 మంది అర్హులు

నరసాపురం రూరల్: మొగల్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 1045 మంది చిన్నారులను మిషన్ వాత్సల్య అర్హులుగా గుర్తించామని నరసాపురం సబ్‌కలెక్టర్ యం సూర్యతేజ చెప్పారు. మంగళవారం తన కార్యాలయంలో మిషన్ వాత్సల్య దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. మొగల్తూరు మండలం నుంచి 287 మంది, నరసాపురం మండలం 442, నరసాపురం నుంచి 316 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరిలో అనాథ పిల్లలు 72, పాక్షిక అనాథ పిల్లలు 846, హెచ్ఐవీ సోకిన పిల్లలు ముగ్గురు ఉన్నారన్నారు. అతి అనారోగ్యానికి లోనైన తల్లిదండ్రుల పిల్లలు 19 మంది, విడాకులు తీసుకుని తల్లివద్ద ఉంటున్న పిల్లలు 97 మంది ఉన్నారన్నారని పేర్కొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

సాక్షి, భీమవరం: జిల్లాలో వానలు జోరుగా కురుస్తుండటంతో సార్వా నాట్లు ఊపందుకున్నాయి. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటం వ్యవసాయ పనులకు ఆటంకం లేకపోవడంతో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.19 లక్షల ఎకరాల్లో సార్వా నాట్లు వేయాల్సి ఉండగా, ఇప్పటికే 59,276 ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం నీరు సమృద్ధిగా అందడంతో రైతులు దుక్కు పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ నెలాఖరునాటికి 50 శాతానికి పైగా నాట్లు పూర్తయ్యే అవకాశముందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.



భీమవరం శివారులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

తీరు మార్చుకోండి

మత్స్య శాఖ అధికారులపై కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: పీఎం మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) గ్రౌండింగ్ చేయడంలో జాప్యంపై మత్స్య శాఖ అధికారులపై కలెక్టర్ పి.ప్రశాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పీఎంఎంఎస్‌వై పథకం అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ రెండో సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకం అమలులో జాప్యం కారణంగా లబ్ధిదారులకు ప్రయోజనాలు చేరడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై అనేకసార్లు సమీక్షించినా మత్స్యశాఖ పనితీరు మెరుగుపడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ఐస్ బాక్సులు, బోట్‌లు, వలలు అందజేయడంతోపాటు మెరైన్ బోట్ యాక్టివిటీస్, కియోస్కుల ఏర్పాటుకు లబ్ధిదారులను గుర్తించి గ్రౌండింగ్ చేపట్టాలన్నారు. మొదటి విడతలో 223 మంది లబ్ధిదారులను గుర్తించిగా 181 మందికి రుణాలు మంజూరయ్యాయని, అయితే కేవలం 50 యూనిట్లే గ్రౌండింగ్ కావడం దారుణమన్నారు. 151 చేపల విక్రయ దుకాణాలు, 20 ద్విచక్ర వాహనాలు, 10 త్రిచక్ర వాహనాలు, 9 నాలుగు చక్రాల కంటెయినర్ వాహనాలు, 16 ఫిష్ రెస్టారెంటుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మిని ఫిష్ రిటైల్ ఔట్‌లెట్స్ గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వాటిని కొనుగోలుదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీ సీఈవో కేవీఎస్ఆర్ రవికుమార్, జిల్లా మత్స్య శాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ ఏడీ ఆనందరావు పాల్గొన్నారు.

వదలని వాన



- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు
- పెరుగుతున్న జలాశయాల నీటిమట్టాలు
- అల్పపీడన ద్రోణితో యంత్రాంగం అప్రమత్తం
- పలు చోట్ల కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

ఏలూరు (మెట్రో): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జోరున వానలతో రెండు జిల్లాలు తడిచి ముద్దవుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 24.3 మి.మీ వర్షపాతం నమోదైతే, పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 12.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లాలో అగిరిపల్లి మండలంలో అత్యధికంగా 71 మి.మీ వర్షపాతం నమోదు కాగా, నూజివీడు మండలంలో 62.8 మి.మీ, ముదినేపల్లి 45.8 మి.మీ, వేలేరుపాడు 43 మి.మీ, చాట్రాయి 32.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా తాడేపల్లిగూడెం మండలంలో 23.4 మి.మీ, పాలకొల్లు 17.6 మి.మీ, తణుకు 17మి.మీ, ఇరగవరం, పెనుగొండలో 15.2మి.మీ, గణపవరం 14.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

అంతటా అప్రమత్తం : అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాల వల్ల జిల్లాలోని పలు ప్రాజెక్టులు, జలాశయాలు నిండుకుండలా మారగా వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు భారీ వర్షాల సమాచారం తెలుసుకునేందుకు, సమస్యలు తెలియజేసేందుకు కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక ఫోన్ నంబర్ 1800 233 1077 ఏర్పాటు చేశారు. అలాగే జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో 95532 20254, కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయం 70131 28597, 98485 90546, వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం 63092 54781 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయన్నారు.

పెరుగుతున్న జలాశయాల నీటిమట్టాలు

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలకు జలాశయాల నీటి మట్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎర్రకాలువ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం ఉన్న 1575.20 ఎంసీఎఫ్‌టీ కాగా, రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 4,428 ఎంసీఎఫ్‌టీ. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి చేరుతున్న నీరు 642 క్యూసెక్కులు. ప్రాజెక్ట్ నుంచి వరద నీరు కిందకు విడుదల చేయడం లేదని ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాసరావు చెప్పారు. ఎర్రకాలువలో చేరుతున్న నీరు కింద ఉన్న ఉప కాలువలలో వచ్చిన వరద నీరు, అది కూడా నిలకడగానే ఉందన్నారు. తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3000 ఎంసీఎఫ్‌టీ. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీరు 935 ఎంసీఎఫ్‌టీ. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోనికి చేరుతున్న నీరు 104 క్యూసెక్కులు. తమ్మిలేరులో చేరుతున్న నీరు కిందనున్న ఉప కాలువలో వచ్చిన వరద నీరు నిలకడగానే ఉంది. కొవ్వాడ కాలువ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం ఉన్న నీరు 183.11 ఎంసీఎఫ్‌టీ. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 436 ఎంసీఎఫ్‌టీ. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి చేరుతున్న నీరు 146 క్యూసెక్కులుగా ఉందన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదారి వరద



కనకాయలంకలో కాజ్‌వే వద్ద తగ్గిన వరద



పడవపై వెళుతున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

యలమంచిలి: గోదావరిలో వరద తగ్గుముఖం పట్టింది. కనకాయలంక కాజ్‌వే మీద గత నాలుగు రోజులుగా ఐదు అడుగులకు పైగా వరద నీరు ప్రవహించగా, మంగళవారం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వరద నీరు వేగంగా తగ్గడంతో కాజ్‌వే కుందులు బయట పడుతున్నాయి. ఇదే విధంగా నీరు తగ్గితే బుధవారం మధ్యాహ్నానికి కాజ్‌వే మొత్తం బయటపడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

సబ్ కలెక్టర్ పర్యటన : కనకాయలంకలో మంగళవారం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పర్యటించారు. లైఫ్ జాకెట్ ధరించి ఇంజిన్ బోటుపై కాజ్‌వే దాటి కనకాయలంక గ్రామంలోకి వెళ్లారు. అక్కడ వైద్య శిబిరాన్ని సందర్శించి గ్రామంలో ప్రజలకు ఏమైనా వ్యాధులు వస్తున్నాయా, అన్ని రకాల మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయా అంటూ సిబ్బందిని ప్రశ్నించి, సమాధానం తెలుసుకున్నారు. అనంతరం కొద్దిసేపు గ్రామస్తులతో మాట్లాడారు. ఈసారి గ్రామంలోకి రాకుండానే వరద తగ్గుముఖం పట్టిందన్నారు.గ్రామంలో తుపాను షెల్టర్‌ను బాగు చేయించాలని, పూర్తి స్థాయి లైన్‌మెన్ లేకపోవడం వలన వరదల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, త్వరలో సమస్యల పరిష్కరిస్తానని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, వీఆర్వో సరెళ్ల లక్ష్మి ఉన్నారు.

ఓర్వలేకే జగన్‌పై విమర్శలు

- కావలిపురం జగనన్న సురక్ష సభలో మంత్రి కారుమూరి
- గ్రామంలో ఆర్‌బీకే, సచివాలయ భవనాల ప్రారంభం



ఓ మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న మంత్రి కారుమూరి, ఏమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఇరగవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ బురద చల్లుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. కావలిపురం గ్రామంలో రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, 40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాలను మంగళవారం మంత్రి కారుమూరి ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. ఢిల్లీలో మీడియాతో కనీసం నాలుగు ముక్కలు మాట్లాడలేని పవన్ కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థ మీద పడి ఏడుస్తున్నాడని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ పార్టీ సభ్యత్వం పేరుతో అందరి దగ్గర చిరునామా, ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారని, అయితే పవన్ కూడా డేటా చోరీ చేసినట్లేనా అన్నారు. వలంటీర్లకు కోర్టులో శిక్ష పడుతుందంటున్న పవన్ కల్యాణ్‌కు మళ్లీ చెబుతున్నా.. వలంటీర్లకు శిక్ష పడితే తణుకు నరేంద్ర సెంటర్‌లో ఉరి వేసుకుంటానని గతంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. అలా జరగకపోతే పవన్ కల్యాణ్ ఏం చేస్తాడో చెప్పాలన్నారు. గతంలో పేదరికంలో రాష్ట్రం 12వ స్థానంలో ఉండగా, వైఎస్ జగన్ సీఎం అయిన నాలుగేళ్లలో 6వ స్థానం లోకి వచ్చిందన్నారు. కావలిపురంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రూ.20 కోట్ల 66 లక్షలు అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. టీడీపీ హయంలో ఐదేళ్లలో రూ.3 కోట్ల 15 లక్షలు ఖర్చు చేశారన్నారు. సీఎంగా మళ్లీ జగన్ కావాలా అని ప్రజలను అడగగా.. కావాలంటూ అంటూ అందరూ చేతులు పైకెత్తి చూపడం విశేషం. ఏమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. కావలిపురంలో 2,054 సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. జిల్లాలో మొదటిసారిగా తడిచెత్త, పొడి చెత్త వేరు చేసే డస్ట్‌బిన్లు అందించామన్నారు. రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు తెలుపుతూ వేసిన ఏపీసీఎన్ఎఫ్ చక్రం చూపరులను ఆకట్టుకుంది. డీపీవో జీవీకే మల్లికార్జునరావు, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కార్యదర్శి యర్లగడ్డ మునిరాజు పాల్గొన్నారు.

సురక్షతో సర్టిఫికెట్ల జారీ సులభం

- విజయవంతంగా జగనన్న సురక్ష
- 476 సచివాలయాల్లో 4,37,610 సర్టిఫికెట్ల జారీ
- రికార్డు స్థాయిలో 1,66,031 ఇంటిగ్రేటెడ్ పత్రాల పంపిణీ
- అందుబాటులో 11 రకాల ప్రభుత్వ సేవలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలకు స్వస్తి



కావలిపురంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర



భీమవరం 3వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు పొందిన మహిళలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూటికి నూరుశాతం లబ్ధిదారులకు చేరాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందుకోలేని వారికి సైతం న్యాయం చేయాలనే గొప్ప ఆలోచనతో ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన పలు రకాల ధ్రువీకరణ పత్రాలను సత్వరమే జారీ చేయడమే కాక ఇంకా సంక్షేమ పథకాలు పొందని అర్హులు ఎవరైనా ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమ ప్రత్యేక టీమ్‌కు దరఖాస్తు చేసుకుని సంక్షేమ పథకాలు లబ్ధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదిసార్లు తిరిగితేనే కాని సర్టిఫికెట్ చేతికి వచ్చేది కాదు. నేడు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే లబ్ధిదారులు సర్టిఫికెట్లు పొందుతున్నారు. దీనిపై పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 4,37,610 సర్టిఫికెట్ల అందచేత

పశ్చిమగోదావరి జిల్లాలో 6.45 లక్షల కుటుంబాలు ఉండగా జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇప్పటివరకు 6.16 లక్షల కుటుంబాలకు సర్వే పూర్తి చేశారు. జిల్లాలో 535 సచివాలయాలు ఉండగా ఇప్పటివరకు 514 సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 5,82,016 సర్టిఫికెట్లు మంజూరు చేయగా ఇప్పటివరకు 5,80,141 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన 1,875 సర్టిఫికెట్లను కూడా మంజూరు చేసి ముమ్ముందు జరిగే జగనన్న సురక్ష క్యాంపుల్లో అందించనున్నారు.

50 వేల వినతులు పరిష్కారం


జిల్లాలో ఇప్పటివరకు జరిగిన జగనన్న సురక్ష క్యాంపులకు మొత్తం 51 వేలు వినతులు రాగా 50 వేల వినతులను పరిష్కరించారు. మిగిలిన వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటివరకు జారీ చేసిన సర్టిఫికెట్ల వివరాలు

కుల ధ్రువీకరణ పత్రం	1,85,503
ఆదాయ	1,82,513
ఆధార్ సర్వీస్ ఫోన్ నంబర్	10,567
సీసీఆర్ కార్డులు	55000
మ్యూటేషన్	222
వివాహ	97
జనన	377
మరణ	469
ఎఫ్ఎంసీ	365
బియ్యం కార్డులు	2,166
హౌస్ హోల్డ్ షిఫ్టింగ్	331
మొత్తం	4,37,610

ఇతర ధ్రువీకరణ పత్రాలు 1,42,531


ఆరేళ్ల తర్వాత రేషన్ కార్డు



గత 6 ఏళ్లుగా రేషన్‌కార్డు లేక చాలా ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నాకు రేషన్‌కార్డు అందించారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ రేషన్‌కార్డు రాలేదు. ఈ కార్యక్రమం ద్వారా రేషన్‌కార్డు అందడం ఆనందంగా ఉంది.

– సొల్వ రమాదేవి, 19వ వార్డు


రెండు రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కార్డు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసిన రెండు రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చారు. గతంలో ఆరోగ్యశ్రీ కార్డు లేక ఆసుపత్రికి వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకుని వైద్యం పొందాల్సి వచ్చేది. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయడంతో నా ఆరోగ్యానికి భరోసా లభించింది.

– దాలబోయిన లక్ష్మి, 24వ వార్డు

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకూ 476 సచివాలయాల్లో నిర్వహించిన క్యాంపుల ద్వారా జిల్లాలో 4,37,610 సర్టిఫికెట్లను ప్రజలకు అందించాం. 50 వేల వినతులను పరిష్కరించాం. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

క్లుప్తంగా

మావుళ్లమ్మవారి హుండీల ఆదాయం రూ.45,00,873



మావుళ్లమ్మవారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీ మావుళ్లమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం రూ.45,00,873 సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజి తెలిపారు. 52 రోజులకు హుండీలను మంగళవారం లెక్కించగా పై ఆదాయంతో పాటు 55.200 గ్రాముల బంగారం, 208.500 గ్రాముల వెండి, 11 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలకు ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమల మండలం వేంపాడు అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌పై చర్యలు తీసుకోవాలంటూ గ్రామానికి చెందిన పిల్లల తల్లిదండ్రులు మంగళవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్–211లో టీచర్‌గా పనిచేస్తోన్న యంత్రపాటి వజ్రం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించడం లేదని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చే మహిళలను ఏమార్చి మభ్యపెట్టి వారితో అనైతిక కార్యక్రమాలు చేయిస్తుందని, దీంతో గ్రామంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. అంగన్‌వాడీ టీచర్‌పై ఇప్పటికే తాము పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం.. వారు వచ్చి విచారణ చేయడం.. క్షమించి వదిలేసి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. గత వారం రోజుల నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు ఎవ్వరూ వెళ్లడం లేదని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకునేంత వరకూ తమ పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రానికి పంపబోమని హెచ్చరించారు. గ్రామస్తుల తరుపున ఫిర్యాదు చేసిన వారిలో ఎం.రవీంద్ర, వై.శ్రీనివాసరావు, ఎంపీ ప్రసాద్, జె.పవన్ కుమార్, ఎం.రాజేష్, వై.రాజు, ఎం.జాను, జి.మంగమ్మ, జె.అమ్మాజీ, ఎం.సత్యవతి తదితరులు ఉన్నారు.

తొలి ప్రాధాన్యత నూజివీడు ట్రిపుల్‌ఐటీకే

- రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో నూజివీడు సీట్లపైనే ఎక్కువ ఆసక్తి
- వసతులు, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్లలో నూజివీడుదే అగ్రస్థానం

నూజివీడు: రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు కోసం విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ట్రిపుల్‌ఐటీలను ఏర్పాటు చేసిన నాటి నుంచి మిగిలిన మూడు ట్రిపుల్‌ఐటీల కంటే నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటుకే అధిక శాతం మంది తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక్కొక్క ట్రిపుల్‌ఐటీలో 1000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కింద అదనంగా మరో 100 సీట్లు కలిపి 1100 సీట్లు ఉన్నాయి. దీంతో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో కలిపి 4400 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది ట్రిపుల్‌ఐటీలకు 38,500 దరఖాస్తులు రాగా ప్రత్యేక కేటగిరీ సీట్లు మినహాయించి మిగిలిన సీట్లకు ఈ నెల 20 నుంచి 25 వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీనిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన తొలి 30 మందిలో దాదాపు 16 మంది నూజివీడు ట్రిపుల్‌ఐటీలోనే చేరడం గమనార్హం.

వసతులు, సదుపాయాలు మెండు

నూజివీడు ట్రిపుల్‌ఐటీలో మిగిలిన వాటి కంటే మెరుగైన వసతులు, సదుపాయాలు ఉన్నాయి. తరగతి గదులకు సంబంధించి మూడు అకడమిక్ భవంతులు, ఇంజినీరింగ్ విద్యార్థులకు సంబంధించి అన్ని బ్రాంచిలకు సంబంధించిన ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎంఎంఈ బ్రాంచికి సంబంధించి రాష్ట్రంలో ఏ ఇంజినీరింగ్ కళాశాలలో లేని విధంగా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో మాత్రమే అత్యాధునిక ల్యాబ్ సదుపాయం



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనాలు



నూజివీడు ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం



ట్రిపుల్‌ఐటీలో మొదటి అడ్మిషన్ పొందిన విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న చాన్సలర్ కేసీ రెడ్డి (ఫైల్)

ఉంది. వీటన్నింటికీ తోడు హాస్టల్ భవనాలు సైతం విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి. డైనింగ్ హాల్స్‌కు ప్రత్యేక భవన వసతి, క్యాంపస్‌లో 24 గంటలూ పనిచేసే 20 పడకల ఆసుపత్రి సైతం విద్యార్థులకు అందుబాటులో ఉంది. ఇవన్నీ ఒకెత్తయితే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకూ మధ్యలో అందుబాటులో ఉండటం వల్ల కూడా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

ప్లేస్‌మెంట్లూ అధికమే..

నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ప్రారంభం నుంచి ప్లేస్‌మెంట్లు అధికంగా ఉంటున్నాయి. ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరంలో నిరంతరం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ అత్యధికమంది విద్యార్థులకు మంచి ప్యాకేజీలు లభించేలా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్లేస్‌మెంట్‌ల కోసం నూజివీడు

ట్రిపుల్‌ఐటీ	కౌన్సెలింగ్‌కు పిలిచిన విద్యార్థులు	చేరినవారు
నూజివీడు	1085	956
ఇడుపులపాయ	1085	898
ఒంగోలు	1085	818
శ్రీకాకుళం	1085	900

ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ సెల్‌నే ఏర్పాటు చేశారు. ఈ సెల్ నిత్యం విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించడం, టెస్ట్‌లు పెట్టడం, సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తూ ఉంటుంది. అంతేగాకుండా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ తదితరాల్లో ప్రావీణ్యత సంపాదించేలా చూడటంతో పాటు కంపెనీలకు ఏమి అవసరమో ఆ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. అంతేగాకుండా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో దాదాపు 25 మంది పర్మినెంట్ ఫ్యాకల్టీ ఉండటం, వీరంతా దేశంలోని ఐఐటీల్లో ఎంటెక్ పూర్తిచేసినవారు కావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేవిధంగా బోధన చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

నూజివీడులో సీటు కోసం అందరూ పోటీపడతారు



వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో అధిక శాతం మంది ప్రథమ ప్రాధాన్యతగా నూజివీడు ట్రిపుల్‌ఐటీనే కావాలని దరఖాస్తు ఫారంలో నమోదు చేస్తారు. ప్రతిభను బట్టి, రిజర్వేషన్‌ను బట్టి మేము అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తాం. క్యాంపస్‌లో వసతి, సదుపాయాలు, సౌకర్యాలు, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్లు, రాకపోకలు సాగించడానికి అన్నింటికీ నూజివీడు ట్రిపుల్‌ఐటీ మెరుగైనది కావడంతో దీనిలో చేరేందుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు.

– ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, ఆర్జీయూకేటీ అడ్మిషన్ల కన్వీనర్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ

బాడీబిల్డింగ్ పోటీల్లో నూజివీడు వ్యక్తి ప్రతిభ



కాంస్య పతకం సాధించిన నూజివీడుకు చెందిన సతీష్‌కుమార్

నూజివీడు: ఇండియన్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ కార్నివాల్‌లో భాగంగా ఇటీవల బెంగళూరులో నిర్వహించిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్–2023లో పట్టణానికి చెందిన కె.సతీష్ కుమార్ పాల్గొని కాంస్య పతకాన్ని సాధించారు. 70 కిలోల పైన కేటగిరిలో ప్రతిభ కనబరిచి పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా సతీష్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

జూదరుల అరెస్ట్ రూ.1.19 లక్షల స్వాధీనం

ఉండి: ఉండి మండలం యండగండి గ్రామ శివారులో గణపవరం మండలం అర్థవరం గ్రామానికి చెందిన అడ్డాడ నాగరాజుకు చెందిన కోళ్ల షెడ్డులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఉండి పోలీసులు, ఎస్ఈబీ పోలీసులు సంయుక్తం మంగళవారం దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,19,820, సెల్‌ఫోన్లు 7, మోటారు సైకిళ్లు 3 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

ఆగస్టు 1న భీమవరంలో శాంతి ర్యాలీ

సాక్షి, భీమవరం: మణిపూర్ ఘటనకు నిరసనగా ఆగస్టు 1న భీమవరం పట్టణంలోని మన్నా చర్చ్ వద్ద నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, ఆలిండియా క్రైస్తవ సంఘాల నాయకుడు మేడిద జాన్సన్ తెలిపారు. మణిపూర్ హింసాకాండను అరికట్టి శాంతిని నెలకొల్పాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా, బైబిల్ మిషన్, లూథరన్ సంఘాల ఆధ్వర్యంలో జాన్సన్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజుకు భీమవరంలో వినతిపత్రం అందజేశారు. మణిపూర్ ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, మైనార్టీలకు



మోషేనురాజుకు వినతిపత్రం అందిస్తున్న జాన్సన్ తదితరులు

భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టా దేవరాజ్, వర్గీస్ దానియేలు, జొన్నగడ్డ శ్యాముల్, వి.రమేష్ బాబు, యూపీఏ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధంలో మాధవరం యోధులు



బోఫోర్సు శతఘ్ని (ఫైల్)



నిప్పులు చెరుగుతున్న బోఫోర్సు శతఘ్నులు (ఫైల్)

తాడేపల్లిగూడెం : భారత్, పాకిస్థాన్‌ల మధ్య కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి మే నెల మొదటి వారంలో ప్రారంభమైన కార్గిల్ యుద్ధం జులై వరకు దాదాపు 60 రోజుల పాటు కొనసాగింది. భారత సైన్యం చలిలో, మంచు పర్వతాల్లో పాకిస్థాన్‌తో యుద్ధం చేశారు. మన దేశ పోస్టులను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకున్నారు. భారత దేశ సైనిక పాటవాన్ని ప్రపంచానికి చాటిన కార్గిల్ పోరులో జిల్లాలోని తాడేపల్లిగూడెం మిలట్రీ మాధవరం గ్రామానికి చెందిన 24 మంది పాల్గొన్నారు. గూడా సుందరరావు, జుజ్జూరి వీర నాగబ్రహ్మంలు మాత్రం నేరుగా యుద్ధంలో పాల్గొన్నారు. మాధవరం ఇమేజ్‌ను పెంచారు. మాధవరం సైనికులంటే పాక్ సైనికుల వెన్నులో వణుకని స్పష్టం చేశారు. నేడు (జూలై 26) కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సుందరరావు, వీరనాగబ్రహ్మంల మనోగతం వారి మాటల్లో..

బాంబులు పడ్డా జంకలేదు



కార్గిల్ యుద్ధ సమయంలో టైగర్‌హిల్ ముందుండే ద్రాస్ సెక్టార్‌లో ఉన్నా. అప్పటికే కార్గిల్ వార్ మొదలైంది. సుబేదార్ మేజర్‌గా ఉన్న నేను శతఘ్నుల వద్ద ఉన్నా. ద్రాస్ సెక్టార్‌లో వాతావరణం మైనస్ ఆరు డిగ్రీలుగా ఉంటుంది. ఆ సమయంలో సిమ్లా ఒప్పందం ప్రకారం భారత పాకిస్థాన్‌లు తమ పోస్టులను ఖాళీ చేయాలి. ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాకిస్థాన్ భారత్‌కు చెందిన ట్రోలోలింగ్, ట్వింగ్ బంప్, గన్‌హిల్, టైగర్ హిల్ పోస్టులను స్వాధీనం చేసుకున్నాయి. సుబేదార్ మేజర్ హోదాలో లైట్ ఫీల్డ్‌గన్ ధరించి రణక్షేత్రంలో ఉన్న సైనికుల కుటుంబాలకు ధైర్యం చెప్పి, వాళ్లను ఇంటికి పంపే బాధ్యత కూడా నాపైనే ఉంది. ఇది నిర్వర్తిస్తూనే హిల్‌పై ఉన్న సైనిక అధికారుల ఆదేశాల మేరకు శతఘ్నులను కొండపైకి సంధించి బాంబుల వర్షం కురిపిస్తున్నాం. ఆ సమయంలోనే మన దేశానికి చెందిన ఆరుగురు సైనికులు చనిపోయారు. 18 మంది గాయపడ్డారు. అయినా ధైర్యాన్ని కోల్పోకుండా యుద్ధంలో పాల్గొన్నాను. దేశం కోసం ఇలా సేవలు అందించడం సంతృప్తిగా ఉంది.

– హానరరీ లెఫ్టినెంటు (రిటైర్డు) గూడా సుందరరావు

దేశ సేవ పూర్వజన్మ సుకృతం



సూర్యోదయం కాగానే ఒక పరిస్థితి. సూర్యాస్తమయం అయిన తర్వాత ఆకు రాలినా అప్రమత్తంగా ఉండే ఉద్విగ్న క్షణాలు. 17 వేల అడుగుల ఎత్తు కొండపై ఆక్సిజన్ అందని స్థితిలో నడుచుకుంటూ శత్రువుల కదలికలను రాత్రి పూట గమనించాలి. రాళ్ల గుట్టే కదా అని దగ్గరకెళ్లే ప్రయత్నం చేస్తే గుట్ట చాటున దాగి ఉన్న పాకిస్థాన్ సైన్యం విరుచుకుపడే ప్రమాదం. ఇలాంటి వాతావరణంలో కార్గిల్ యుద్ధంలో జాట్‌రెజిమెంటు తరపున ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌లో నాయక్ హోదాలో పాల్గొన్నాను. ఆ సమయానికి శ్రీనగర్ సమీపంలోని పాంపూర్ నౌగామ్ లొకేషన్‌లో ఉన్నాను. ఆ సమయంలోనే కార్గిల్ సెక్టారుకు రావాలని సమాచారం అందింది. వెంటనే ప్రయాణమయ్యాం. అప్పటికే యుద్ధంలో పాక్ సైనికులు ఇండియా పోస్టులను ఆక్రమించుకున్నారు. పెట్రోలింగ్‌కు వెళ్లిన భారత సైనికులు అదృశ్యమవుతున్నారు. కళ్లముందు శత్రువును దెబ్బతీయడమే లక్ష్యంగా సాగుతున్న తరుణంలో మాస్కోవెల్లి గ్రామం సమీపంలోని పింపల్ వన్, పింపల్ టు సెక్టారులో విధులు నిర్వర్తించి 4875 సెక్టారును ఆక్రమించి మాస్కోవెల్లి గ్రామాన్ని రక్షించాం. కార్గిల్ పోరులో విజయులుగా నిలిచాం. కార్గిల్ తర్వాత నార్త్‌సిక్కిం, ఈస్టు సిక్కింలలో ఫీల్డ్ ఆపరేషన్లలో పాల్గొన్నాను. మిలట్రీ మాధవరంలో పుట్టడం గర్వంగా భావిస్తా. దేశమాతకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం.

– నాయక్ జుజ్జూరి వీర నాగబ్రహ్మం (రిటైర్డు)

మణిపూర్ ఘటన అమానుషం



కొయ్యే మోషేనురాజు

సాక్షి, భీమవరం: మణిపూర్ ఘటన అమానుషమని తనను తీవ్రంగా కలచివేసిందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణల్లో గిరిజన మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన నాగరిక సమాజంలో సిగ్గుచేటని, నేటికీ మహిళ పట్ల ఇటువంటి ఘటనలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలను రాజకీయాలకు అతీతంగా అందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో అనేక చట్టాలు పొందుపర్చారని, వాటిని సమర్థవంతంగా అమలుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని మోషేనురాజు స్పష్టం చేశారు. మణిపూర్‌లో హింసాకాండను అణచివేసి శాంతిభద్రతలను పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మోషేనురాజు కోరారు.

సమగ్రశిక్షలో బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమగ్రశిక్ష పరిధిలో జిల్లా, మండల స్థాయిల్లో పని చేస్తున్న ఐఈ కోఆర్డినేటర్లు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు, మండలంలో పని చేస్తున్న అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్ల బదిలీలు చేపడుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో పని చేస్తున్న ఆయా ఉద్యోగులు తమ బదిలీల కోసం ఈ నెల 28న సాయంత్రం 5 గంటలలోపు సమగ్రశిక్ష అదనపు పథక సమన్వకర్త ఏలూరు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. పరస్పర బదిలీలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, స్పౌస్, పీహెచ్‌సీ, మహిళా ఉద్యోగులకూ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. బదిలీలు జిల్లా స్థాయి కమిటీ ద్వారా నిర్వహిస్తామని, అంతర జిల్లా బదిలీలు కోరే వారు దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అనుమతితో సమర్పించాలని, బదిలీలకు దరఖాస్తు ఫారాలను మండల విద్యాశాఖాధికారులకు పంపామని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పోలవరం రూరల్: పొలంలో మోటార్ వేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై పోలవరం వైద్యశాలలో చికిత్స పొందుతూ ఒక రైతు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామానికి చెందిన తొంటా హరికృష్ణ పోశికుమార్ (42) అనే వ్యక్తి యథావిధిగా మంగళవారం ఉదయం వ్యవసాయ పనులు నిమిత్తం, అన్న కుమారుడితో కలిసి పొలం వెళ్లాడు. ఉదయం మోటార్ రిపేర్ చేస్తున్న క్రమంలో మోటార్ స్టార్ట్ కావడానికి నీరు పోస్తుండగా ఐరన్ పైప్ పట్టుకున్నాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని రైతులంతా అతన్ని పోలవరం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. పోశికుమార్ కుమారుడు పానక్ పాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న చంద్రబాబు



మంగరాజు

సాక్షి, భీమవరం: పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వకుండా ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అడ్డుకోవడం దారుణమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సెల్ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు పెత్తందార్లకు మద్దతుగా అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఇళ్లను అడ్డుకోడానికి ఢిల్లీలో ప్రయత్నాలు చేయడం చూస్తుంటే పేదల పట్ల చంద్రబాబుకున్న ప్రేమ అవగతమవుతోందని వివరించారు. చంద్రబాబు దృష్టపన్నాగాన్ని అడ్డుకుని జగన్ పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. జగన్ దళితుల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే.. చంద్రబాబు తన హయాంలో మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌లకు ప్రజలు చమరగీతం పాడతారని మంగరాజు స్పష్టం చేశారు. సమావేశంలో పి.ప్రేమకుమార్, సీహెచ్ రమేష్, వి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై హత్యాయత్నం

- మనవరాలు కిడ్నాప్
- తల్లికి గాయాలు, తాత తీవ్ర గాయాలతో భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స

ఆకివీడు: పెళ్లికి అంగీకరించలేదని, యువతి తాత, తల్లిపై హత్యాయత్నం, ఆమెను కిడ్నాప్ చేసిన ఘటన మంగళవారం సిద్దాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి తల్లి సయ్యద్ సబియా సుల్తానా ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం ఎస్సై ఎస్.సత్యసాయి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన సయ్యద్ సబియా సుల్తానా తన తల్లి అనారోగ్యంతో తణుకులో చికిత్స పొందుతోంది. దీంతో ఆమె తన తండ్రి బాబర్‌కు వంట చేసేందుకు రెండు రోజుల క్రితం తన రెండో కుమార్తెతో సిద్దాపురం వచ్చింది. గతంలో పుట్టింటికి వస్తున్న తరుణంలో సిద్దాపురం గ్రామ శివారు కురుపాకకు చెందిన ఇమ్రాన్ తన కూతురి వెంట పడి అల్లరి చేస్తుండేవాడు. గతంలో పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు అంగీకరించకపోవడంతో వారు పుట్టింటికి వచ్చిన విషయం తెలుసుకుని ఇమ్రాన్ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో



భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బాబర్

వరండాలో నిద్రిస్తున్న సబియా సుల్తానా తండ్రి బాబర్‌పై కొబ్బరికాయలు వలిచే ఇనుప కట్టర్‌తో దాడికి పాల్పడ్డాడు. అడ్డు వచ్చిన సబియా సుల్తానా, ఆమె కుమార్తెపైనా దాడి చేశాడు. సుల్తానా కుమార్తెను తన వెంట రాకపోతే సుల్తానాను చంపేస్తానని బెదిరించాడు. సుల్తానా కుమార్తెను ఇమ్రాన్ తన టీవీఎస్ మోపెడ్‌పై తీసుకెళ్లిపోయాడు. సుల్తానాకు గాయాలుకాగా, తన తండ్రి బాబర్‌కు తలపై బలమైన గాయాలయ్యాయి. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిచ్చిన స్టేట్‌మెంట్ మేరకు హత్యాయత్నం, కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై సాయి వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కాళ్ల: తాళం వేసిన ఇంట్లో జరిగిన చోరీపై మంగళవారం కాళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దొడ్డనపూడి గ్రామానికి చెందిన యిర్రింకి రామారావు తన భార్యకు వైద్యం నిమిత్తం ఈనెల 23న సాయంత్రం ఇంటికి తాళం వేసి హైదరాబాదు ఆసుపత్రికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి తలుపు తెరిచి ఉండడాన్ని గమనించిన గ్రామానికి చెందిన కొల్లి రాము అనే వ్యక్తి రామారావు అల్లుడు పడవల సత్యనారాయణకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశాడు. దీంతో సత్యనారాయణ లోపలికి వెళ్లి చూడగా దొంగలు బీరువా తలుపులు బద్దలుకొట్టి ఆరు కాసులు బంగారు వస్తువులను దొంగిలించినట్టు గుర్తించారు. దీనిపై బాధితుని అల్లుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దెందులూరు: వరి సాగులో వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని, రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు టి.సుజాత, కె.ఫణికుమార్, ఎస్.నాగేంద్రబాబు దెందులూరు మండలం సోమవరప్పాడులో మంగళవారం వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి నారుమడుల్లో నీటిని తొలగించడం వల్ల విత్తనం గాలి పోసుకుని ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల్లో ఐదు రోజులు కన్నా ఎక్కువగా నీట మునిగితే నష్ట నివారణకు నీటిని తీసివేయాలన్నారు. తరువాత ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్‌పొటాష్ వేసుకోవాలని సూచించారు. వరి పంట తెగుళ్ల బారిన పడకుండా మొక్క నిలదొక్కుకున్నాక లీటరు నీటికి గ్రాము కార్బటాజిమ్ ప్లస్ 2.5 గ్రాముల మాంకోజ్ జెల్ కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరి నాట్లు పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసిన తరువాత పైపూతగా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల యూరిటాప్ పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు. మొక్క కోలుకున్న తరవాత కుళ్లు తెగులు రాకుండా లీటరు నీరుకి ఒక గ్రాము కార్బటాజిమ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. దెందులూరు ఏఓ గద్దె రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గమిని సేవలు స్ఫూర్తిదాయకం



గమిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీటౌన్): లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు గమిని సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, అతిథి అంబికా రాజాలు కొనియాడారు. పట్టణంలో మంగళవారం వివిధ ప్రాంతాల్లో గమిని ఫౌండేషన్ ద్వారా పేదలకు దుప్పట్లు అందజేశారు. ఎస్‌ఎల్‌పీ నాయుడు, పదం కుమార్ గుప్తా, నూకల నాగ మల్లేశ్వరరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, వట్టిప్రోలు రాము, మదన్‌మోహన్ అగర్వాల్, కె.మురళీకృష్ణ, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, జితేంద్ర, యర్రా ఆంజనేయ స్వామి, మెహర్ ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణంలో మంగళవారం విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఏఐఎస్ఎఫ్ నాయకులు మోటార్ సైకిల్స్‌పై తిరుగుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూయించి వేశారు. విద్యార్థులకు జరుగుతున్న లోటు పాటులను తొలగించాలని కోరుతూ ఈ బంద్ నిర్వహించారు. సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని, ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు వర్రే అజయ్, వి.రాజేష్, బి.వీర్రాజు, ఎం.యశ్వంత్, బి.రాజు, బాలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం



కొట్టు విశాల్‌ను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్ : మహిళా శక్తిని మించిన మరో శక్తి లేదని వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్ అన్నారు. వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా కిట్టీ వనితా హంగామా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొట్టు విశాల్ మాట్లాడుతూ నిత్యం ఇంటి పనులతో బిజీగా ఉండే మహిళలు ఒక్కరోజు హంగామా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా మహిళలు తమ బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తారన్నారు. మహిళలను సంఘటిత పరిచే హంగామా వంటి కార్యక్రమాలను నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా గ్రంధి సత్యనారాయణ, హంగామా మహిళలు కొట్టు విశాల్‌ను ఘనంగా సత్కరించారు. హంగామా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కొట్టు విశాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మారం వెంకటేశ్వరరావు, కోనా శ్రీనివాసరావు, తదితరులు హాజరయి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారంతో 35 వార్డుల్లో పూర్తయ్యాయి. సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను అందచేసినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి దాసరి సావిత్రి, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఎంఈ మురళీకృష్ణ, కొలుకులూరి ధర్మరాజు, వట్టి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అడ్వకేట్ శ్రీనివాసరాఘవరావు మృతి

తాడేపల్లిగూడెం (టీటౌన్): తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ అడ్వకేట్ చామర్తి శ్రీనివాస రాఘవ రావు (బాజు) (60) మంగళవారం ఉదయం స్వర్గస్తులైయ్యారు. అనారోగ్య కారణాలతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస వదిలారు. న్యాయవాది బాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస రాఘవ రావు పట్టణ ప్రముఖులు దివంగత చామర్తి సుందర కామేశ్వరరావు (ప్లీడర్ బాబ్జి) ద్వితీయ కుమారుడు, సినీనటుడు దివంగత చామర్తి రాజా సోదరుడు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పిరెడ్డి, సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాసరావు, గాజుల గోపికృష్ణ తదితర న్యాయవాదులు బాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లులర్పించారు.

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష

తాడేపల్లిగూడెం రూరల్: సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష కార్యక్రమం అని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం, అప్పారావుపేట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. వెంకట్రామన్న గూడెంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గాకిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా అర్హత ఉండి పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చనున్నట్టు తెలిపారు. అలాగే ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం 1438మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. అప్పారావుపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ పాల్గొని, 2450మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నందనరావు, పంచాయతీ ఈవోలు ఆర్‌వీ.బ్రహ్మం, వి.వాణి, సర్పంచ్ పోలిమోను నాగఅంజూష, అరుగొల్లు శ్రీనివాస్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, నాయకులు పోలిమోను శ్రీనివాస్, అడపా హరిబాబు, ములకాల చినశ్రీను, విద్యాకమిటి చైర్మన్ నీలపాల నరేష్, బుంగా నాగేశ్వరరావు, అయినం రామారావు, బండారు నాగేశ్వరరావు, అడపా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: మండలం కొమ్మర గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

జగనన్న సురక్ష పేదప్రజలకు రక్ష

పెంటపాడు: ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు తెలిపారు. మండలంలోని రావిపాడు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 1289 కుటుంబాలకు గానూ. 1089 కుటుంబాలు సర్వే పూర్తి చేశారని తహసీల్దార్ తెలిపారు. ఇందులో 1246 మందికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష శిబిరంలో అందజేశారు. ఈ సందర్భంగా పెంటపాడు తహసిల్దార్ జీవీ శేషగిరిరావు మట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సురక్ష శిబిరం పేదలకు ఎంతో రక్ష అన్నారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, అవసరమైన ధ్రువపత్రాలు ఈ శిబిరంలో అందిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో జగనన్న సురక్ష ఎంతో మంచి కార్యక్రమమన్నారు. పథకాలతో పాటు, అవసరమైన ధ్రువపత్రాలను ఈ శిబిరం ద్వారా అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరం ద్వారా ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. నాయకులు ములగాల రామసత్యనారాయణ (బాబ్జి) మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం ద్వారా సీఎం జగనన్న అర్హులైవారందరికి పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వింజమూరి శ్రీనివాస్, ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ, బట్టు భరతాంజనేయులు, ములగాల సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ప్రసాద్, మండల అగ్రికల్చర్ అధికారి కె. పార్థసారధి, కైగాల గణపతి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా పక్కాగా ప్రభుత్వ సేవలు

అత్తిలి: ప్రజలకు పక్కాగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించడం జరిగిందని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ అన్నారు. మంగళవారం అత్తిలి మండలం కొమ్మర, వరిఘేడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్‌లు పెన్మెత్స రామసీత, పి సత్యవతి, జెడ్పీకోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, ఉపసర్పంచ్‌లు మన్యం దానారావు, అడ్డాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు అనిశెట్టి త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షులు కునాధరాజు శ్రీహరిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మద్దాల శ్రీనివాస్, సత్తి గణేష్‌రెడ్డి , ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ పేర్కొన్నారు. జగనన్న సురక్ష సర్వే ముగింపు కార్యక్రమంలో భాగంగా పెంటపాడులోని పెంటపాడు-3 సచివాలయం కునాకరపేట వద్ద ప్రజలకు అధికారులు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల బాబి నాగమణి చదలవాడ శ్రీనివాసరావు, బర్ల జయరాంబాబు, మారంపూడి ఏసు, వెలగల శ్రీనివాసరెడ్డి (బస్సులరెడ్డి) ఉండ్రాజవరపు గోపి, కర్రి పృద్వీకుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బాస్కరరెడ్డి కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలం : వెంకట్రామన్నగూడెంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ దుర్గాకిషోర్



పెంటపాడు : లబ్ధిదారుడికి ధ్రువపత్రాలు అందజేత

మణిపూర్ ఘటనపై పెల్లుబికిన ఆగ్రహం

తణుకు: మణిపూర్ జరిగిన దారుణ ఘటన జరిగినప్పటికీ పట్టించుకోకుండా నిరంకుశ ధోరణితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు నిరసనగా తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మణిపూర్ ఘటనలకు పాలకవర్గాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వానికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, బొద్దాని మురళీకృష్ణ, అప్పారి శ్రీను, మందుల రత్తయ్య, బిక్కవోలు వెంకటేశ్వరరావు, మందుల మంగమ్మ, మందుల లక్ష్మి, పుట్టా అమ్మిరాజు, బొద్దాని కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో...

మణిపూర్‌లో జరుగుతున్న హింసకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాధ్యత వహించాలని ప్రజాసంఘాలు, మహిళా సంఘాల నాయకులు ఆరోపించారు. మంగళవారం తణుకులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలు సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ మణిపూర్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మోదీ, అమిత్‌షాలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి, కార్యదర్శి పీవీ ప్రతాప్, ఐలూ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, యూనియన్ నాయకులు ఎస్.ఆదినారాయణబాబు, ఎ.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: మణిపూర్‌లో రెండు జాతుల మధ్య విభేదాలను ప్రేరేపిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, తక్షణమే మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటి సభ్యురాలు పాలుపూరి సత్యవతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కండెల్లి సోమరాజు, మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, మహిళా సంఘం నాయకులు పాలుపూరి వెంకాయమ్మ, మాగంటి రమణ, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పాలుపూరి సత్య, కొండపల్లి శిరీష, పాలుపూరి ధనలక్ష్మి, మన్నే సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంటలో నిరసన తెలుపుతున్న సీపీఎం, మహిళా సంఘం నాయకులు

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

తణుకు టౌన్: మణిపూర్‌లో మారణ హోమానికి కారణమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని సామాజిక న్యాయపోరాట సమితి, తణుకు బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మణిపూర్ మారణకాండకు నిరసనగా తణుకు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయపోరాట సమితి అధ్యక్షుడు పేరూరి మురళీకుమార్, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రవీంద్ర, పౌరహక్కుల సంఘం నాయకుడు కొరు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప్ దత్, జిల్లా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అధ్యక్షుడు కామన మునిస్వామి, ఎస్సీ,ఎస్టీ దళిత క్రైస్తవ ఐక్యవేదిక నాయకుడు మద్రే అబ్రహం, ఈద రామకృష్ణ, వెన్నపు సుధాకర్, మాజీ కౌన్సిలర్ తాతపూడి మారుతీ రావు, నక్కా అజయ్‌కుమార్, కుసుమ యాకోబురాజు, కత్తుల జస్పాల్, ఎం ప్రతాప్ కుమార్, ఎస్ సోమేశ్వరరావు, ఎం టోనీ, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలను ఖండించండి

తాడేపల్లిగూడెం (టీటౌన్): మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ కేంద్ర పార్టీ పిలుపు మేరకు పట్టణంలోని బస్సు స్టాండ్ పూలే విగ్రహం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజు, అల్లం రాము, రావూరి బాబీ, బొమ్మిడి వర్మ, గొబ్బిళ్ల ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

దువ్వలో పొలం బడి కార్యక్రమం



దువ్వలో పొలంబడి కార్యక్రమంలో కందులను అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: పంట సాగులో శత్రు, మిత్ర పురుగులను గుర్తించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె కుసుమ చెప్పారు. మంగళవారం దువ్వ గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు పంటలకు సంబంధించి శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని కోరారు. వరిపంటపై ఆశించే పలు రకాల పురుగులను నివారణకు గట్లపై కందులను సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాదించవచ్చన్నారు. ఈ సందర్భంగా వరి పంట పొలాల గట్లపై ఎల్ఆర్‌జీ 52 రకం కందుల సాగు కోసం విత్తనాలను అందజేసి గట్లపై నాటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అరుణ్, మల్లికార్జునరావు, పుష్ప, అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

సచివాలయాలు.. సేవాకేంద్రాలు

- లబ్ధిదారుని ఇంటివద్దకే సంక్షేమ సేవలు
- గ్రామ స్వరాజ్యం వచ్చిందంటున్న జనం

పెంటపాడు: అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజల ముంగిటకు సంక్షేమ సేవలు చేరువ చేసేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలులోకి తెచ్చిన గ్రామ సచివాలయాలు తమకు సంక్షేమ పథకాలు అందించే సేవాకేంద్రాలుగా ఉన్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ సేవలు ఇంటివద్దకే అందిస్తున్న గ్రామ సచివాలయాలు కేంద్రాలతో గ్రామ స్వరాజ్యం వచ్చిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 21 పంచాయతీలకు ఆయా గ్రామాల్లో వేల జనాబా చొప్పున 18 సచివాలయాలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతీ సచివాలయంలో 10 శాఖలకు చెందిన అధికారులను ప్రభుత్వం నియమించింది. సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చింది. గ్రామ కార్యదర్శి, డిజిటల్ సహాయకులు, పిషరీష్ సహాయకులు, వెటర్నీరీ అసిస్టెంట్, గ్రామ రెవిన్యూ సహాయకులు, ఎలక్ట్రికల్ అసిస్టెంట్, హెల్త్ సహాయకులు, మహిళాపోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ అసిస్టెంట్ తదితర శాఖల అధికారులను సచివాలయంలో ప్రజల అవసరాల కోసం అందుబాటులో ఉంచింది. సచివాలయంతో గ్రామ స్వరాజ్య సంక్షేమ పాలన కోసం ప్రభుత్వ ఇతర కార్యాలయాలు, చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సకాలంలో ప్రజలకు సేవలందిస్తున్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం వచ్చిందంటున్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ కార్యాలయాలు రావడం అవినీతికి ఆస్కారం లేకుండా సకాలంలో సేవలందిస్తున్న సచివాలయాలు దేశంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేంద్రం కూడా ఈ వ్యవస్థను కొనియాడుతోంది. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు వివిధ ప్రభుత్వ పథకాలకు సబంధించిన సేవలకు గ్రామ సచివాలయంలో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. నవరత్నాలకు సంబంధించి పింఛన్ల పంపిణీ అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, కాపు నేస్తం, కొత్త పింఛన్, ఇంటిస్థలం, నిర్మాణం, భూముల రీసర్వే. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెసిడెన్సియల్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో అనేక సేవలను వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి అందిస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా కూడా పలు సేవలు అందుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




జట్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం

18 సచివాలయాలకు నూతన భవనాలు

సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలనే ధ్యేయంతో ప్రభుత్వం నిర్మాణపనులు చేపట్టింది. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు 18 సచివాలయాలు ప్రభుత్వం నిర్మిస్తోంది. కొన్ని పూర్తికాగా మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి.

కాళ్లరిగేలా తిరిగేవాళ్లం



పింఛన్ సొమ్ముకోసం గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిప్పుకొనేవారు. వేలిముద్ర పడలేదంటూ ఏడాదిలో ఒకటి రెండు నెలల సొమ్ము చేతికి ఇచ్చేవారు కాదు. గ్రామ సచివాలయాలు వచ్చిన తరువాత వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము ప్రతీనెల అందిస్తున్నారు. – సింగం వెంకట్రావు రావిపాడు

సంక్షేమం అందిస్తున్నారు



సచివాలయాలు వచ్చిన తరువాత వలంటీర్లు అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. మా పాపకు పాఠశాలకు వెవెళ్తున్నందుకు అమ్మఒడి రూ. 15 వేలు పడుతోంది. ఆసరా లబ్ధి రూ. 18,500 వస్తుంది. వాహన మిత్ర, విద్యాదీవెన, పిల్లలకు చదువులకు అవసరమైన కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలకు గతంలో తహసీల్దార్ కార్యాలయానికి వెవెళ్లవలసి వచ్చేది. వలంటీర్లు సచివాలయంలో దరఖాస్తు చేయించి ధ్రువీకరణ పత్రాలు ఇంటికి తెచ్చి ఇస్తున్నారు.
– మద్దాల లక్ష్మి, రావిపాడు

వలంటీర్లకు వందనం: కుటుంబ సభ్యుల్లా సేవలందిస్తున్న వలంటీర్లు



నా పేరు నడింపల్లి బంగారమ్మ. నేను తేతలి నివసిస్తున్నాను. మా వలంటీర్ గూడుపు అనిత మా కుటుంబ సభ్యురాలిగా మా కుటుంబానికి సేవలందిస్తున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఆమె ఎంతో మేలు చేసింది. మా ఇంటికి ఎవరూ రాని సమయంలో ఆమె మాకు అవసరమైన నిత్యావసర వస్తువులు, మందులు తీసుకు వచ్చి ఇచ్చింది. మా కుటుంబానికే కాకుండా తన పరిధిలోని ఏలూరు, భీమవరం పట్టణాల్లోని ఆసుపత్రుల్లో ఉండే వారి వద్దకే సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్‌లు అందించారు. గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయల వద్ద పడిగాపులు కాసి ఎన్ని రోజులు ఎదురు చూసినా పింఛన్ అందేది కాదు. ప్రతీ 1వ తేదీ ఉదయమే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందించి నడవలేని వృద్ధులకు చాలా మేలు చేస్తున్నారు.
– నడింపల్లి బంగారమ్మ, తేతలి, తణుకు రూరల్ మండలం.

సేవలకు సలాం



నా పేరు వీరమల్లు కనక దుర్గ, నేను తేతలిలో నివసిస్తున్నాను. మా వలంటీరు ఆరేపల్లి కుమారి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ పథకాన్ని మాకు ఇంటికి చేరవేస్తుంది. మా ఇంటిలోని పిల్లలకు అమ్మ ఒడి పథకంలో నుంచి చేయూత, అసరా వంటి పథకాలకు అవసరమైన అన్ని పనులు వలంటీరే చేశారు. మా అమ్మాయికి వసతి దీవెన పథకం డబ్బులు సమయాకిని బ్యాంక్‌లో పడకపోతే వలంటీరే సచివాలయం చుట్టూ తిరిగి ఆడబ్బులు వచ్చేలా చేశారు. జగనన్న సురక్ష పథకం ద్వారా మా ఇంటిలోని వారందరికీ అవసరమైన సర్టిఫికేట్‌లు మేము గతంలో మాదిరిగా కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా అన్ని సర్టిఫికేట్‌లు అందచేశారు.
– వీరమల్లు కనక దుర్గ, తేతలి, తణుకు రూరల్ మండలం

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



తాడేపల్లిగూడెం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం, కృష్ణాయపాలెం, సంజీవ్‌నగర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశాలను మండల విద్యాశాఖాధికారి వి.హనుమ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చించిన అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని, మూడు రోజులుగా వరుసగా బడికి రాని విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌లో విద్యా సంక్షేమ కార్యదర్శి సహాయంతో నమోదు చేయాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయడం, వర్క్ బుక్ కరెక్షన్ క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు సరి చేయాలన్నారు. ఈ సమావేశాల్లో ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం రూరల్: హైదరాబాద్‌లో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి విస్సంపల్లి సిద్ధూ పిలుపునిచ్చారు. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో పెదముత్తి రాజేంద్ర అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ గ్రామ సభ సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ చలో హైదరాబాద్‌కు మాదిగలంతా సిద్ధంగా ఉండాలని కోరారు. ఎస్సీవర్గీకరణ సాధించి తీరాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటి నిర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జ్ కంభంపాటి మల్లిఖార్జునరావు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ రవికుమార్, కోఇన్‌ఛార్జ్ గాలింకి ప్రేమ్, మాదిగ యువసేన మండల నాయకులు నాని, తాడేపల్లిగూడెం పట్టణాధ్యక్షుడు లంకా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా పేర్లు నమోదు చేసుకోండి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ మండలంలో 2024 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆగస్టు 21వ తేది వరకు ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ, తొలగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



